మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి



మహిళా వైద్య సిబ్బంది సురక్షితంగా తమ విధులు నిర్వహించాలంటే ప్రభుత్వం వైద్య శాలల్లో రక్షణ ఏర్పాట్లు చేయాలి. రాత్రి వేళల్లో విధుల్లో ఉండే వైద్యులు, వైద్య సిబ్బంది కోసం ప్రత్యేకంగా వాచ్‌మెన్‌లను నియమించాలి. మహిళా హెల్పర్లనూ అందుబాటులో ఉంచాలి. ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చి తక్షణం స్పందించేలా పోలీసు వ్యవస్థను అనుసంధానం చేయాలి.

– హెచ్.పీ రూత్, స్టాఫ్ నర్స్, పీహెచ్‌సీ, కొల్లూరు

చట్టాలను కఠినంగా అమలు చేయాలి



కోల్‌కతాలో వైద్యవిద్యార్థిపై జరిగిన హత్యాచారం విషాదకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. చట్టాలను కఠినతరం చేసి సమర్థంగా అమలు చేయాలి. శిక్షలను చూసి నేరం చేయాలంటే నిందితులు భయపడాలి. వైద్యులు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి. ఆస్పత్రుల్లో రాత్రి విధుల్లో ఉండేవారికి భద్రత కల్పించాలి.

– దామెర్ల శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్, అర్బన్ హెల్త్ సెంటర్, రేపల్లె

క్లుప్తంగా

రేపు రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అద్దేపల్లిలో రైతులకు శిక్షణ



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో గురువారం ఆత్మ (గుంటూరు) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం వ్యవసాయశాఖాధికారి జి.మీరయ్య అధ్యక్షతన జరిగింది. బాపట్ల జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఖరీఫ్ వరిలో ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాల ఆవశ్యకత గురించి వివరించారు. వరిలో చీడపీడల నివారణ చర్యలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.పాండురంగారావు రైతులకు ద్రవ, ఘన జీవామృతాల వల్ల కలిగే లాభాలు, తయారీ విధానం వివరించారు.

ఎమ్మార్సీలో సమీక్ష



భట్టిప్రోలు: స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్, పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్సీలు సురేష్ కుమార్, కిషోర్, ఎంఈఓ నీలం దేవరాజు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రతి సోమ, గురువారాలు పాఠశాలలోని టాయిలెట్స్ పర్యవేక్షణ, ఫొటో క్యాప్చరింగ్ చేయాలని సూచనలు, సలహాలు అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ల విధులు, బాధ్యతలు తెలియ చేసి పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



పిట్టలవానిపాలెం: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసురావు చెప్పారు. మండలంలోని చందోలు, భవనం వారిపాలెం గ్రామాలలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించి సర్వస్వం కోల్పోయిన ఐదు కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ తరపున తాత్కాలిక గుడారాల ఏర్పాటుకు టార్పాలిన్ పట్టాలు అందజేశారు. పోలీసురావు మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు ఆదేశాల మేరకు టార్పాలిన్ పట్టాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్లపాలెం రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మందపాటి పరమానందకుమార్, ఆనందరావు, దొంతిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారాయణం




భట్టిప్రోలు: శ్రావణమాసం పురస్కరించుకుని శుక్రవారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పారాయణ కార్యక్రమం కోట యుగంధర్–హారిక దంపతుల స్వగృహంలో నిర్వహించారు. కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూర్లె అరుణకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలి



చుండూరు(వేమూరు) సైబర్ నేరస్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేష్ తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, వాటి నుంచి బయటపడే మార్గాలను ఆయన వివరించారు. మోసాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి పొందాలని చెప్పారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, రామయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



పూర్తిగా ఎండిపోయిన వేమూరు మండలం బలిజేపల్లిలోని పంచాయతీ చెరువు



వేమూరు మండలంలోని చావలి గ్రామ పంచాయతీ చెరువు ఇలా..



కొల్లూరు మండలంలోని రావికింపాడు పంచాయతీ చెరువు దుస్థితి ఇదీ..

నలుచెరువులా కరువు

వేమూరు నియోజకవర్గంలో వర్షాలు లేక కరువు విలయతాండవం చేస్తోంది. నెర్రలిచ్చిన భూములు ఆకాశం వైపు అర్రులు చాస్తున్నాయి. చెరువులు పూర్తిగా ఎండిపోయి బీళ్లను తలపిస్తున్నాయి. పశువులు నీరులేక అంగలారుస్తున్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఐదు మండలాలు ఉండగా, 95 చెరువులు ఉన్నాయి. దాదాపు అన్నీ పూర్తిగా ఎండిపోయాయి. పచ్చిక, డెక్కతో పూడుకుపోయాయి. జలాశయాల్లో నీరు ఉన్నా.. కాలువల్లోకి పారడం లేదు. అయినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. చెరువులు నింపే ప్రయత్నం చేయడం లేదు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రాలే నిదర్శనం. గత ప్రభుత్వంలో వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కాలువలు కళకళలాడాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక వానల్లేక ఈ దుస్థితి దాపురించిందని గ్రామీణులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– వేమూరు

అవినీతి అధికారులను ఉపేక్షించేంది లేదు

మాజీ ఎమ్మెల్సీ అన్నం

బాపట్ల: బాపట్ల నియోజకవర్గంలో కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే విషయం బయట పడుతోందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు కొంత మంది ప్రతి ఫైల్‌కు కొంత ఇవ్వాల్సిందేనంటూ వసూళ్లు మొదలు పెట్టారని, ఇప్పటికే పలుమార్లు తన దృష్టికి వచ్చిందని అన్నం తెలిపారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించేందుకూ వెనుకాడేదిలేదని పేర్కొన్నారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. బీజేపీని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోయేందుకు వారధి కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో చంద్రబాబు నాయుడు చిత్రపటంతోపాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రధాని నరేంద్రమోదీ ఫొటోలనూ అధికారులు పెట్టాలని సూచించారు. సమావేశంలో నాయకులు కొండారెడ్డి అనిల్, పేర్లీ సునీల్, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీకుబేర హోమార్చన

బాపట్లటౌన్: పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో శ్రావణమాసం ఆజ ఏకాదశి సందర్భంగా గురువారం లక్ష్మీ కుబేర హోమార్చన నేత్రపర్వంగా నిర్వహించారు. లలితా త్రిపుర సుందరీ పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు ఆధ్వర్యంలో స్వామికి పసుపుకొమ్ములు, కుబేర కుంకుమార్చన, తామరపూలతోపాటు 18 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు సాయంత్రం వరకు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామ్, మేడూరి వెంకట అప్పలాచార్యులు, కొల్లిపర ప్రసాద్ స్వామి, సాయివెంకట్, దేవాలయ ధర్మకర్త మార్టూరి బద్రీనారాయణ, వక్కలగడ్డ వెంకట శ్రీనివాసరావు, శంకరనారాయణ, కొత్రా శ్రీనివాసరావు, తిరుమలశెట్టి దయాసాగర్ పాల్గొన్నారు.



పాండురంగ స్వామి ఆలయంలో లక్ష్మీకుబేర హోమార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

విద్యార్థులకు పోటీలు



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు

వెల్లటూరు(భట్టిప్రోలు): తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలు, పాటలు, రామాయణం, క్విజ్, చిత్రలేఖనం, సామెతలు, ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీలను ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయురాలు పి.శైలజ, వెంకట స్వామి, వ్యాయామోపాధ్యాయులు వి.హరిప్రసాద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.మురళీ మోహన్, రెడ్డి సుధాకర్, ఎస్టేట్ బాబు, వి.శ్రీనివాసరావు, కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో ఏకాహ భజన

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో గురువారం ఏకాదశి పురస్కరించుకుని ఏకాహ భజన జరిగింది. హరే రామ హరే రామ రామరామ హరేహరే హరే కృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే భజన నిర్వహించారు. అమ్మవార్లకు అర్చకులు క్రోవి రామకృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ పర్యవేక్షించింది.

చదువుతోపాటు ఆటలూ అవసరం

నగరం: విద్యార్థులకు చదువుతోపాటు ఆటలూ అవసరమని ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వం పొందవచ్చునన్నారు. క్రీడలలో రాణించిన వారికి ప్రభుత్వం ఉన్నత విద్య,ఉద్యోగాలలో రాయితీలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత మృతి

రేపల్లె రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ రేపల్లె ఏరియా సమితి సభ్యుడు బొలిశెట్టి సత్యనారాయణ(73) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారులు, కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ మరణవార్త తెలుసుకున్న సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు పి.నాగాంజనేయులు గురువారం వచ్చి మృతదేహాన్ని సందర్శించి జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిదానంపాటి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు దివాన్‌తోట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గాజులు, పూలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ కార్యదర్శి అక్కల సుబ్బారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి విగ్రహాన్ని తాడిబోయిన సుయోధన్, గోమాత విగ్రహాన్ని ఇమ్మడిశెట్టి మోహనరావు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధి మంగళగిరి వేణుగోపాలరావు, బాపట్ల మండల కన్వీనర్ మోదుగుల సూరిబాబు, సుందరశెట్టి రమేష్, వారి సాంబశివరావు, దోమ అంజిరెడ్డి, వాలి సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ప్రతిష్ఠించిన నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి విగ్రహం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తెనాలి అర్బన్: వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో చినరావూరు పార్కు వద్ద గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జ్వరాల సంఖ్య బాగా పెరుగుతోందన్నారు. పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకుంటూ, దోమల్ని నిర్మూలించాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. అనంతరం వాకర్లకు వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని తెలియజేసే కరపత్రాల్ని పంపిణీ చేశారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల

బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులంతా వేయించుకోవాలి

తెనాలి అర్బన్: బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులైన ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ సూచించారు. తెనాలి మండలం కొలకలూరు, కొల్లిపర మండలం మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్థులు, స్మోకింగ్ చేసేవారు, బీపీ మందులు వాడేవారు, టీబీ వ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులు అర్హులని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రాజా రమేష్, మున్నంగి, కొలకలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ దిలీప్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్



బాపట్ల టీచర్స్‌కాలనీలో రోడ్డు పక్కనే చెత్త డంప్



బాపట్ల జగనన్న కాలనీ ప్రధాన రహదారి మార్జిన్‌లో వ్యర్థాలు

నిర్లక్ష్యం ముంచెత్తంగా!

పాలకులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాపట్ల పట్టణాన్ని చెత్త ముంచెత్తుతోంది. ప్రధాన రహదారుల మార్జిన్లు, డ్రైయిన్లు చిన్నపాటి డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. డ్రైయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరుగుతున్నాయి. దీనివల్ల విషజ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన కార్యాయాలు ఉన్న ప్రాంతాలతోపాటు, జిల్లా, మున్సిపల్ అధికారులు నిత్యం తిరిగే రోడ్లలోనూ చెత్త రోజుల తరబడి పేరుకుపోతోంది. అయినా అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీనికి ఈ చిత్రాలే నిదర్శనం.

– బాపట్లటౌన్



జగనన్న కాలనీలోని అంతర్గత రోడ్డు పక్కనే ఇలా..



పటేల్‌నగర్ నుంచి కాపు కల్యాణ మండపానికి వెళ్లే దారిలో ఇదీ దుస్థితి..



డీఈఓ కార్యాలయం ముందు డ్రెయిన్‌లో పేరుకున్న చెత్త

తెలుగులో తీర్పు

తెనాలి రూరల్: స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ వరుసగా మూడో రోజు తీర్పును తెలుగులో చెప్పారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వారం రోజుకో తీర్పును తెలుగులో చెప్పాలని న్యాయమూర్తి నిర్ణయించారు. ఈ మేరకు ఓఎస్ నంబరు 74/2024 కేసు గురువారం విచారణకు రావడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి తీర్పును తెలుగులో చెప్పారు.

ఉచిత ఇసుక కోసం హెల్ప్ డెస్క్

ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను అరికట్టేలా తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకోవడం, ఇతర సమాచారం కోసం హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

■ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన తెనాలి మండలం పెదరావూరు వద్ద గురువారం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్, మరో ప్రయాణికుడు గాయాల పాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com